


# చుక్కాని చేతిలో సరంగు • 'మిర్రర్'

పైన ఎండ మండుతూంది.
కడుపులో ఆకలి మండుతూంది.

ఎంతకీ రాని బస్సు మీద నాకు ఒళ్ళు మండుతూంది.

ఈ సమయంలో కోటీ బస్సు స్టాండ్ నరకంలా ఉంది.

బస్సుకోసం ఎదురు చూస్తున్న ప్రయాణీకులు నరకానికి తేబడ్డ పాపుల్లా ఉన్నారు.

కాకీ యూనిఫారంలో తిరుగుతున్న ఆర్. టి. సి. సిబ్బంది పాపులను యమధర్మరాజు ముందు హాజరు పరిచే యమభటుల్లా ఉన్నారు.

అతని కళ్ళల్లో ఏదో ఆరాధన.

ఆమె చేతినిండా గోరింటాకు—

అతని చేతికి తళతళా మెరుస్తున్న కొత్త గడియారం.

ఆమె జడలో వాడిన పూలు—

అతని తలపై చెదరిన జుట్టు.

ఆమె ముందు ఓ ప్లాస్టిక్ బుట్ట.

అతని ముందు ఓ సూట్ కేసు.

ఇద్దరి ముందూ—

పైన గుడ్డతో బిగించి కట్టిన ఓ ఊరగాయి జాడీ.

ఓర్పు నశించిన ప్రయాణీకులు తలా ఒక చోటు ఆసరా చేసుకుని శాపవిమోచనకై ఎదురు చూసే దీనుల్లా ఉన్నారు.

అలాంటి మండు టెండలో—

ఆ ఇద్దరుమాత్రం—

అతడు—ఆమె.

నిండు కొలనులో అప్పుడే విచ్చిన కలువల్లా—

పొగమంచులో విరబూసిన గులాబీల్లా—

చెక్కు చెదరకుండా—

పండు వెన్నెలలో విహరించే రతీమన్మథుల్లా—

వెండి కొండపై వెలసిన శివపార్వతుల్లా ఉన్నారు.

ఆమె మొహంలో ఆదోరకపు సిగ్గు—

అంతా చూస్తుంటె వాళ్ళిద్దరూ కొత్త దంపతులనే విషయం చెప్పకనే తెలుస్తూంది.

అతను తదేకంగా ఆమె ముఖంలోకి చూస్తున్నాడు.

ఆమె సిగ్గుతో మరోవైపుకి చూస్తూంది.

కొత్త జంట !

కొత్త జీవితం !

కొత్త ఉత్సాహం !

వారి ఉత్సాహం చూసిం తరువాత నా చిరాకు కొంచెం తగ్గింది.

రామచంద్రపురం బస్సు స్టాప్‌లో నుంచున్నారు కాబట్టి అతను బి. హెచ్. ఇ. ఎల్. లో పని చేస్తూ ఉండవచ్చు.

వాళ్ళిద్దర ఇంతకుముందే ఏ విజయవాడ నుంచో డీలక్సు బస్సులో వచ్చి ఉంటారు.

ఆ ఇద్దరినీ చూస్తుంటే కొత్తలో నా పెళ్ళి నాటి రోజులు గుర్తు ఒస్తాయి.

• • • •

అయిదేళ్ళ కిందట—

మాలతి మెడలో తాళి కట్టినప్పుడు—

ప్రపంచాన్ని జయించిన చక్రవర్తిలా అనుభూతి చెందాను.

ఒంటరి పయనం సాగిస్తున్న నా జీవిత నౌకకు ఆమె చుక్కాని వంటిదని భావించాను.

చుక్కాని సాయంతో సంసార సాగరంలో నా జీవిత నౌక ఒడిదుడుకులు లేకుండా గమ్యంవైపుకి పయనిస్తుందని ఆశపడ్డాను.

బహుశ అతను కూడా ఆమె పట్ల నాలాగే ఆశలు పెంచుకుంటూ ఉండవచ్చు.

• • •

నా ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ—

బస్సు వచ్చి ఆగింది.

నాగరిక వేషం వేసుకున్న అనాగరికుల్లా తోసుకుంటూ, కుమ్ముకుంటూ అంతా బస్సు ఎక్కారు.

అందరితోపాటు నేనూను.

వాళ్ళిద్దరు ఓ సీటు ఆక్రమించుకున్నారు.

ఆమె కిటికీ ప్రక్కన.

అతను ఆమె ప్రక్కన.

వాళ్ళిద్దరి వెనక సీటులో నేను.

బస్సు బయలుదేరింది. బయలుదేరి హైదరాబాదు రాజవీధుల్లో పరుగెత్తసాగింది.

పరుగెత్తుతున్న బస్సులోంచి—

చేతితో బయటకు చూపుతూ అతను దేని గురించో ఆమెకు చెపుతున్నాడు.

వినపడీ వినపడకుండా రహస్యంగా ఆమె చెవిలో చెబుతుంటే ఆమె సిగ్గుతో కుదించుకుపోతూంది. అతను చెప్పే విషయం గ్రహించిందో లేదో కూడా తెలియటం లేదు.

• • • •

నా పెళ్ళి అయిన కొత్తలో మాలతి కూడా ఇలాగే సిగ్గుపడేది.

ఆ రాత్రి—

తొలినాటి రాత్రి.

ఆమె ఎంతకీ తన మొహం నాకు చూపలేదు.


బలవంతాన ఆమె ముఖం నావైపుకి, తిప్పుకుంటే తటాలున రెండు చేతులతో మొహం కప్పుకుని కళ్ళు మూసుకుంది.

ఆ ఒక్క భంగిమ, ఆ ఒక్క సన్నివేశం చాలు—

ఏ యువకుడికైనా జీవితాంతం మధుర స్మృతులలో తేలిపోవటానికి.

స్త్రీ సహజమైన ఆమె సిగ్గు నేను పురుషుడినన్న విషయం గుర్తు తెచ్చింది. ఆమె హృదయ సామ్రాజ్యాన్ని జయించిన మహారాజుని నేనేకదా అని "మగపోజు" పెట్టాను.

ఆమె సిగ్గు, నా మగపోజు ఎల్లకాలం అలాగే ఉంటాయనుకున్నాను.




* * *

బస్సు రాణిగంజులో ఆగింది.

అనేకరకాలు అయిన పళ్ళు అమ్ముకుంటూ బస్సు చుట్టూ మూగారు.

అతనికే ఆకలి వేసిందో—

ఆమెపై ప్రేమ కలిగిందో తెలియదు కానీ—

జామపండు కావాలా—

యాపిలు కావాలా?

అంటూ అతను ఆమెను అడిగాడు.

ఆమె ఎంతకీ జవాబు చెప్పటం లేదు.

ఇతను రెట్టిస్తూంటే ఆమె సిగ్గుతో మరో వైపుకి చూస్తూ మరింత బిగుసుకుపోసాగింది.

చివరికి—

ఒక్కమాట అంది—

"మీ ఇష్టం" అని.

* * *

ఆ రాత్రి మాలతి కూడా.

తీపి పదార్థాలతో నిండిన పళ్ళెం చూపుతూ "నీకు లడ్డూ కావాలా—పాలకోవా కావాలా" అంటే

"మీ ఇష్టం" అంది.

ఆ రోజున ఆమె మాటలకు—

జీవితం అంతా "నా ఇష్టప్రకారమే" ఆమె నడుచుకుంటుందని మురిసిపోయాను.

నాన్నను శాసించే అమ్మలా కాకుండా—

బావను జడిపించే అక్కలా కాకుండా—

బాబాయిని ఒణికించే పిన్నిలా కాకుండా—

మామయ్యను మాయచేసే అత్తలా కాకుండా!

—అంతా నా ఇష్టానికి వదిలి.

—నా ఆనందమే తన ఆనందంగా భావిస్తూ అణుకువగా ఉండే భార్య లభించటం—

—నా అదృష్టంగా భావించి, నాన్న, బావ, బాబాయి, మామయ్యల పట్ల సానుభూతి పెంచుకుంటూ, నా అదృష్టం పట్ల గర్వం పెంచుకుంటూ—ఆ రోజున నేను పొందిన అనుభూతి వ్యక్తపరచ లేనిది.

* * *

బస్సు తిరిగి బయలు దేరింది.

అతను ఒక జామపండు ఆమె కిచ్చాడు.

రెండోది తను కొరికి తినటం మొదలుపెట్టాడు.

ఆమె తన చేతిలో జామపండు అలాగే ఉంచుకుని ఇంకా బయటకు చూస్తూనే ఉంది

ఆమెకు "కొత్త సిగ్గు" ఇంకా వదిలిపోలేదు. అతని ముఖంలోకి సూటిగా చూడలేకపోతుంది. అయితే అతనికి ఆమె ధోరణి పట్ల విసుగు లేదు. ఆమె సిగ్గుపడుతున్నకొలదీ ఇతనికి ముచ్చటగా ఉంది.

* * *

ఆ రోజుల్లో తనూ ఇలాగే ముచ్చటపడ్డాడు.

అప్పట్లో ఒకసారి—

తనూ, మాలతీ టాంకుబండుమీదకి షికారు వచ్చారు. ఆ వెన్నెలటి సాయంకాలం—

మనసు రెక్కలు కట్టుకుని ఆకాశమార్గంలో విహరిస్తుంటే—

ఇద్దరూ కలిసి ఐస్‌క్రీం తింటూ షికారు చెయ్యాలని కోరిక పుట్టింది.

రెండు ఐస్‌క్రీం కప్పులు కొని ఒకటి ఆమె చేతికిస్తే—తినకుండా అలాగే ఉంచుకుంది.

అప్పటికి ఇంకా మాలతికి కొత్త సిగ్గు పోలేదు.

ఆమెను తినమని బ్రతిమలాడుతుండగానే ఇద్దరి చేతుల్లోని ఐస్‌క్రీం కరిగిపోయింది.

అదొక మధురానుభూతి.

ఆమె సిగ్గుపడటం, వినయం ప్రదర్శించటం, అన్నీ నా ఇష్టానికి వదిలి వేయటం అంతా ఒక నాటకంలో సన్నివేశంలా సాగిపోయింది.

రోజులు గడుస్తూంటే సన్నివేశం కూడా మారి పోసాగింది.

మారిన సన్నివేశంలో పాత్ర వేషం మారింది. వేషంతోపాటు అభినయం మారిపోయింది.

కాలం గడుస్తుంటె—

జీవితం పాతబడుతుంటె—

ఇద్దరిమధ్యా అవగాహన పెరుగుతూంటె—

ఒకరి తత్వం ఒకరికి అర్థం అవుతూంటె—

మాలతి—

అమ్మలాగా!

అక్కలాగా!

పిన్నిలాగా!

అత్తలాగా!

"మీ ఇష్టం" అన్న నోటితోనే "నా ఇష్టం" అనసాగింది. సిగ్గు అభినయించిన మొహంలో కోపం ప్రదర్శించసాగింది.

క్రొత్తగా వచ్చిన ఆఫీసరు మొదట్లో మెత్తగా ఉండి తరువాత ఎలా కొరకరాని కొయ్యలా తయారు అవుతాడో అలా మారిపోయింది మాలతి.

తను క్రమంగా—

నాన్నలా!

బావలా!

బాబాయిలా!

మామయ్యలా!

మారిపోసాగాడు.

మాంత్రికుడి వెనక నడిచివెళ్ళే జంతువులా తను మాలతి వెనక నడవసాగాడు.

ఈరోజున—

తన ఆనాటి "పురుషత్వపు పొగరు" లేదు.

"మగరాయ" అంతకంటె లేదు.

అన్నీ పోయాయి.

సంసార సాగరంలో తన జీవిత నౌకకు ఆమె చుక్కానిలా వచ్చింది. కానీ ఆమె క్రమంగా 'తరంగుకి ఎదురు తిరిగే చుక్కాని" అయింది.

నావ నడుపుతూంది కానీ తరంగు ప్రమేయం లేకుండానే.

చుక్కాని నావకు దారి చూపుతూంది—కానీ తరంగుని లెక్కచేయకుండానే.

ఆడపిల్ల కొత్తగా కాపరానికి వచ్చినప్పుడు "అంతా మీ ఇష్టం" అంటుంది.

ఆ తరువాత "అంతా నా ఇష్టం" అంటుంది.

అది ఆమె తనతో స్వతహాగా తెచ్చుకునే గుణం.

ఆ గుణం లేకుండా ఆమె లేదు.

మాలతి ఆ రోజున "అంతా మీ ఇష్టం." అంటె "ఆహా" అనుకున్నాను. కానీ ఈ రోజున "నా ఇష్టం" అంటుంటె "వూహూ!" అంటు న్నాను.

ఇలా అనే వాళ్ళందరినీ ఆ రోజుల్లో "పౌరుషం" లేని మగవాళ్ళు అనుకునేవాడిని. కానీ నేనూ అలాంటి వాడినే అని తెలిసిన తరువాత రాజకీయ నాయకుడిలా ఆ పార్టీలో కలిసిపోయాను.

* * *

బస్సు రామచంద్రపురం చేరుకుంది.

అతను ఆమె దిగారు.

ఆమె ఇంకా సిగ్గు అభినయిస్తూంది.

అతను ఇంకా ఆమె అభినయానికి మురిసి పోతున్నాడు.

కానీ జీవిత నాటకంలో మరో సన్నివేశం ఉందని వూహించలేకపోతున్నాడు.

పూర్ ఫెలో! ★